తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
22-04-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 82
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## పార్కుల అద్దెలపై మున్సిపల్ అధికారుల కొరడా

- మల్కాజిగిరి మున్సిపాలిటీ కబ్జాలపై అరా

సిరి ఎఫెక్ట్



**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 21:**

హైదరాబాద్ మహా నగరంలో పబ్లిక్ పార్కులను అద్దెలకిస్తున్న వైనాన్ని మంగళవారం సిరి దినపత్రికలో "ఇచట పార్కులు అద్దెకివ్వబడును" శీర్షికన వార్త ప్రచురితం అయ్యింది. జరుగుతున్న వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన సిరి కథనం పై మల్కాజిగిరి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని డివిజన్ లలో పలువురు అధికారులు విచారణ చేపట్టగా కొన్ని పార్కుల్లో అద్దెకు ఖాళీస్థలం ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది.

## ఉగ్రవాది అని అనలేదు

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా
- మోడీపై వ్యాఖ్యలకు మల్లిఖార్జున ఖార్గే వ్యాఖ్యలు



4

## ఇరాన్ తో చర్చలకు సిద్ధం

శాంతి దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు
అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అదినేత
బెదిరింపులకు లొంగం: ఇరాన్



4



## తమిళనాడు ఘటన తరహాలో కేరళలో ఘటన

- ఆరుగురు మృతి .. 40 మందికి గాయాలు

4

ఔను.. లాయర్లతో మాట్లాడడానికే

## ఢిల్లీ వెళ్లా

- కేసీఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కేసీఆర్ సభరోజు సభ పెట్టారు
- మాజీ మంత్రి హరీష్ రావు



2

# సొంతింటి భాగ్యమేదీ?

హైదరాబాద్... అద్దె జీవితం
భాగ్యనగరంలో సొంత ఇళ్ల కొరత
70%కు పైగా అద్దె ఇళ్లలోనే నివాసం
మెడ్చల్, రంగారెడ్డిలోనూ తక్కువ ఓనర్‌షిప్
గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇళ్లే అధికం



**హైదరాబాద్, ఏప్రిల్ 21 :**

కలల నగరంగా పేరుగాంచిన హైదరాబాద్‌లో సొంత ఇల్లు కల సాధించడం రోజురోజుకీ కష్టసాధ్యంగా మారుతోంది. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే 2024 వెల్లడించిన గణాంకాలు నగర వాస్తవ పరిస్థితిని స్పష్టంగా చూపిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యల్పంగా సొంత ఇళ్ల శాతం హైదరాబాద్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం 23.08 శాతం మందికే సొంత ఇళ్లు ఉన్నాయని సర్వే పేర్కొంది. మిగిలిన 70.63 శాతం మంది అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారు. అంటే నగరంలో మెజారిటీ జనాభా అద్దె జీవితం గడుపుతోందన్న మాట. రాష్ట్రవ్యాప్తంగా అద్దెకు నివసించే వారి సంఖ్యలో హైదరాబాద్ ముందంజలో ఉండటం గమనార్హం. నగర పరిసర ప్రాంతాలైన మెడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కూడా సొంత ఇళ్ల శాతం తక్కువగానే ఉండటం

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

- నార్వే బృందతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:**

తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే



3

## రేపట్నుంచే ఆర్టీసీ సమ్మె

- నేటి అర్ధరాత్రి నుంచే నిలిచిపోనున్న బస్సులు
- ఇదే చివరి సమ్మె కావాలి: జేఏసీ
- హైదరాబాద్, ఏప్రిల్ 21: ఆర్టీసీ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగబోతున్నారు

సమ్మె ఆలోచన

## విరమించండి

చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



2

## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

- ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం



**జనగామ, ఏప్రిల్ 21:**

సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి

మిగతా 2వ పేజీలో..

రేవంత్ రాహువు,

## కేసీఆర్ కేతువు

అప్పుడు కేసీఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి విమర్శలు



3



2

## అబద్దాలు చెప్పడంలో కేసీఆర్

### పదేళ్లలో అబద్దాలతోనే పాలన చేశారు

- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

తెలంగాణకు పదేళ్లలో

## కేంద్రం రూ.12 లక్షల కోట్లు

రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి



2



## ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

- రైతులను హెచ్చరించిన అధికారులు
- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

**రంగారెడ్డి, ఏప్రిల్ 21:**

ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని

మిగతా 2వ పేజీలో..

## అబద్దాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

- మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపీ అర్వింద్



2



# సొంతింటి భాగ్యమేదీ?

మొదటిపేజీ తరువాయి

ఇదే ధోరణిని సూచిస్తోంది.
ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. నారాయణపేట్, వనపర్తి, జోగులాంబ గద్వాల వంటి జిల్లాల్లో ఎక్కువ మంది ప్రజలు సొంత ఇళ్లలోనే నివసిస్తున్నారు. తక్కువ ధరకే భూములు అందుబాటులో ఉండటం, వంశపారంపర్యంగా ఇళ్లు లభించడం వల్ల అక్కడ ఓనర్‌షిప్ అధికంగా ఉంది. దీంతో నగరం-గ్రామాల మధ్య గృహ పరిస్థితుల్లో స్పష్టమైన అంతరం కనిపిస్తోంది.
హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్ని తాకడం ప్రధాన కారణంగా చెప్పబడుతోంది. ఐటీ రంగం విస్తరణ, పెట్టుబడులు పెరగడం వల్ల భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో మధ్య తరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు సొంత ఇల్లు కొనడం భారంగా మారింది. అదనంగా, ఉద్యోగాల కోసం తరచూ మారాల్సిన పరిస్థితులు, భవిష్యత్తుపై అనిశ్చితి కారణంగా కూడా చాలామంది అద్దె ఇళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
మొత్తంగా చూస్తే, హైదరాబాద్‌లో అద్దె జీవితం సాధారణంగా మారిపోతోంది. నగర అభివృద్ధితో పాటు గృహ వ్యయాలు కూడా పెరగడం వల్ల సొంత ఇల్లు అనే కల చాలా మందికి ఇంకా దూరంగానే మిగిలిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్
# పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు

- బిఆరఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

నల్గొండ, ఏప్రిల్ 21:



అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆరఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆరఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్దాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆరఎస్ పార్టీ ఎప్పుడో విచ్చిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆరఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆరఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆరఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమెప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆరఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్టాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్టాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవి□క్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

## తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

- రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 21:



తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్టానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆరఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్ధలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆరఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆరఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

# సమ్మె ఆలోచన విరమించండి

- చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 21:



టీజీఎసఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెను వెంటనే విరమించాలని వారికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మీ సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కార్మికులకు ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీ బలోపేతానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రయాణికుల దృష్టిలో ఆలోచించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికిప్పుడు చర్చకు తాము సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు వద్దంటూ బీఆరఎస్ అధినేత కేసీఆర్ పేర్కొనడం బాధాకరమన్నారు. హైడ్రాను రద్దు చేస్తామంటే కబ్జాదారులకు మద్దతు ఇవ్వడమేనని మంత్రి పొన్నం అభిప్రాయపడ్డారు. జగిత్యాలలో సోమవారం బీఆరఎస్ పార్టీ భారీ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను రద్దు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి వద్దని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల పొన్నం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్‌కు లేఖ రాయాలి. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చూడాలి. రెండు రాష్టాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం అని లేఖలో పొన్నం పేర్కొన్నారు. తన వినతిని అర్థం చేసుకుని తగిన విధంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

- మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపీ అర్వింద్

హైదరాబాద్, ఏప్రిల్ 21:


వ్యవసాయ మోటర్లకు కరెంట్ మోటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆరఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.



# ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.



# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఔను.. లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

- కేసీఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కేసీఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 21:



బీఆరఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి దిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప□చారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆరఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆరఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్ మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం □స్టేట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఏదీ
- ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 21:**

తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్ధతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 22 నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన పక్రియ ఇప్పటికీ మొదలు పెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారంలోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ ఛైర్మన్ వెంకన్న. సమ్మె చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అందరూ సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# రేపట్నుంచే ఆర్టీసీ సమ్మె

- నేటి అర్ధరాత్రి నుంచే నిలిచిపోనున్న బస్సులు
- ఇదే చివరి సమ్మె కావాలి: జేఏసీ
- హైదరాబాద్, ఏప్రిల్ 21: ఆర్టీసీ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగబోతున్నారు.

**హైదరాబాద్**




ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో సమ్మె తథ్యమని స్పష్టమవుతున్నది. ఇదే జరిగితే మంగళవారం అర్ధరాత్రి నుంచే మొదటి డ్యూటీ బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. ఈలోగా సమ్మెను నిరోధించేందుకు ప్రభుత్వం ఏవైనా చర్యలు చేపడితే తప్ప ఈ నెల 22 నుంచి సమ్మె యధాతథంగా కొనసాగుతుందని ఆర్టీసీ కార్మిక సంఘాలు చెప్తున్నా యి. సమ్మె గడువు దగ్గరపడుతున్నా ప్రభు త్వం నుంచి చర్చల ఊసే లేకపోవడంపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ తీసుకోకపోతే కచ్చితంగా సమ్మె జరుగుతుందని తేల్చిచెప్తున్నారు.

నిరుడు మే 6న సమ్మెకు దిగనున్నట్టు ప్రకటించిన ఆర్టీసీ కార్మికులతో ప్రభు త్వం చర్చలు జరిపి, సమ్మెకు వెళ్లకుండా అడ్డుకున్నది. ఇప్పుడు ప్రభుత్వంలో ఎలాంటి చల నం లేకపోవడంతో సమ్మెకు వెళ్లడమే సరైన నిర్ణయమని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ భావిస్తున్నది. సమ్మెకు వెళ్తున్న కార్మికులపై పలు డిపోల్లో అధికారులు ఇప్పటికే ఆంక్షలు విధించారు. ఆ ఆంక్షలకు వెరవకుండా సమ్మెకు తరలిరావాలని కార్మికులకు జేఏసీ పిలుపునిచ్చింది. కార్మికులు ఐక్యతతో గట్టిగా పోడాడితే ఆర్టీసీలో ఇదే చివరి సమ్మె అవుతుందని జేఏసీ నేతలు చెప్తున్నారు. తమతో ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరుపకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచే బస్సులు డిపోల్లో ఆగిపోతాయని, బుధవారం ఉద యం నుంచే సమ్మె పూర్తిస్థాయిలో ప్రారంభమవుతుందని చెప్తున్నారు.

**ముఖ్యమంత్రిపైనే భారం**

ఆర్టీసీ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుపై యాజమాన్యం పూర్తిగా చేతులెత్తేసే దిశ గా అడుగులు వేస్తున్నది. అందులో భాగంగా సమ్మె డిమాండ్లతో తమకు ఎలాంటి సం బంధం లేదని లేబర్ కమిషన్‌కు పంపిన లేఖలో స్పష్టం చేసింది. దీంతో సీఎం నేరుగా రంగంలోకి దిగితే తప్ప తమ సమస్యలకు పరిష్కారం లభించదని కార్మికులు భావిస్తున్నా రు. మంగళవారం సాయంత్రంలోగా తమ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలువకపోతే సమ్మె తథ్యమని స్పష్టం చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు కార్మిక సంఘాలపై నిషేధం ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్లు మినహా మిగతా డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం సుముఖంగా ఉన్నట్టు తెలుస్తున్నది. కానీ, ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుండా ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిరోధించడం ఎలాగన్న దానిపై తర్జన భర్జన కొనసాగుతున్నది.

**సమ్మెకు కలిసి వస్తామన్న ఇతర సంఘాలు**

దీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ఎన్నో వినతులు సమర్పించినా స్పందన లేకపోవడంతో తాము సైతం సమ్మెకు కలిసి వస్తామని జేఏసీలో లేని కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, తమ కార్యాచరణ ప్రకటించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు యూనియన్ల పునరుద్ధరించాలని, 2021, 2025 వేతన సవరణ, 2017 పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సహా అన్ని సమస్యలను మంగళవారం మధ్యాహ్నంలోగా పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో 22 నుంచి జరిగే సమ్మెకు తాము కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

- కార్యకర్తలకు మంత్రి దామోదర్ సూచన

**సంగారెడ్డి, ఏప్రిల్ 21 :**



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా పదవిని అనుభవించాలన్నారు. వొచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని, కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని, అవకాశవాదం ఎక్కువని అన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో మరో మూడు నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్న బియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర్ చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. రూ.200 కోట్ల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర్ తెలిపారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు

- అప్పుడు కేసీఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:**



కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆరఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆరఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

**మొదటిపేజీ తరువాయి**

కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ 'నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ 'నార్వే వర్కింగ్ గ్రూప' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.



## అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులకు అనుకూలం

- తెలంగాణ అవకాశాలు పుష్కలం
- పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- ఇటలీ రాయబారికి మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 21 :**

అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధులను ఆయన కోరారు. ఇటలీ దేశ రాయబారి 'ఆంటోనియో బార్టోలి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఏయే రంగాల్లో తెలంగాణ ఇటలీ కలిసి పనిచేసేందుకు అవకాశాలున్నాయనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. నేడు ఐరోపాలోనే అత్యంత బలమైన ఎగుమతి ఆధారిత, ఉత్పాదక రంగం కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇటలీ కొనసాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మెషినరీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమోటివ్ సిస్టమ్స్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, అనుసరిస్తున్న వ్యూహాలను, పాలసీలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. భారత్‌ఇటలీ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రీ 4.0, రోబోటిక్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, క్లీన్ మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో ఇటలీ మార్గదర్శకం తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీకి నమ్మకమైన భాగస్వామిగా ఉండేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టం మరింత బలోపేతమయ్యేలా టీ హబ్, వీ హబ్, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్కు, యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలతో ఇటలీ కంపెనీలు, నిపుణులు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చొరవ చూపాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఈ సమావేశం తొలి అడుగు మాత్రమే.. రాబోయే రోజుల్లో తెలంగాణకు నమ్మకమైన భాగస్వామిగా మారుతాం.. కీలక రంగాల్లో కలిసి పని చేస్తాం.. ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం అని ఇటలీ రాయబారి

## రూ.2.5 కోట్ల హాష్ ఆయిల్ స్వాధీనం

- నలుగురు అరెస్ట్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్*

**హన్మకొండ, ఏప్రిల్ 21:**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా భారీ స్థాయిలో హాష్ ఆయిల్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన చర్యల్లో నలుగురు సభ్యులను అదుపులోకి తీసుకుని, సుమారు రూ.2 కోట్ల 50 లక్షల విలువైన 20 కిలోల హాష్ ఆయిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు చేసిన వారిలో హంటల్ సన్ను (23), హంటల్ సన్యాసి (23) — చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషా; కండెల చిన్నబాబు (56) — అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్; కృష్ణా హంటల్ (56) — చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషాకు చెందినవారని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు కిలో పాండు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచి మిగతా నిందితుల ద్వారా విక్రయిస్తూ డబ్బు సంపాదించేవాడు. గంజాయి విక్రయాల ద్వారా వచ్చే డబ్బు సరిపోకపోవడంతో పరారీలో ఉన్న కిలో పాండు పరిచయం అయ్యాడు. అతని సూచనల మేరకు గంజాయి మొక్కల నుండి హాష్ ఆయిల్ తయారీ చేపట్టారు.

నిందితులు గంజాయి మొక్కల ద్వారా సుమారు 40 కిలోల హాష్ ఆయిల్ తయారు చేశారు. అందులో 20 కిలోల హాష్ ఆయిల్‌ను కిలో పాండు తీసుకోగా, మిగతా 20 కిలోలను ప్యాకెట్లుగా భద్రపరిచి ముంబైలో విక్రయించేందుకు తీసుకెళ్లాలని యోచించారు. ఈ నెల 19న తుని రైల్వే స్టేషన్ నుండి కోణార్క్ రైలులో బయలుదేరిన నిందితులు, వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు జరుగుతున్నాయన్న అనుమానంతో అక్కడే దిగారు.

ఈ రోజు ఉదయం వరంగల్ బస్టాండ్ సమీపంలోని రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న 20 కిలోల హాష్ ఆయిల్‌ను గుర్తించి అరెస్టు చేశారు.

ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## మన పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు

- గర్వకారణమన్న మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 21:**

నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'దివ్య భారత్' పర్యాటక నివేదికలో రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించడంపై పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన పర్యాటక సామర్థ్యానికి ఈ నివేదిక అద్దం పడుతోందని, ఇది గర్వకారణమని అన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానిలోని హుస్సేన్ సాగర్, చారిత్రక గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి కట్టడాలతోపాటు ఆధ్యాత్మికత ఉట్టిపడే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు నిత్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వివరించారు. కేవలం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలే కాక ప్రకృతి ఒడిలో విరాజిల్లే కుంటాల, బొగత జలపాతాలు, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందిన సమ్మక్కసారలమ్మ మేడారం జాతర వంటి సాంస్కృతిక వేడుకలు రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని మంత్రి చెప్పారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి ఇక్కత్ వంటి సంప్రదాయ కళలు పర్యాటక రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకించేందుకు దేశవిదేశీ పర్యాటకులు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు.

## లౌకికవాదానికి, అభివృద్ధికే తమిళుల పట్టం

- తమిళనాడులో డీఎంకే కూటమిదే విజయం
- తెలంగాణలో హామీలను అమలు చేశాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**చెన్నై, ఏప్రిల్ 21 :**

తమిళనాడులో డీఎంకేకాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ మధు యాష్కీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి రాణిపేట జిల్లా షోలింగర్ నియోజకవర్గంలో నీ కారిక్కల్, వీరనట్టూర్, అరియూర్, అయిపేడు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. తమిళ ప్రజలు అభివృద్ధి, లౌకికవాదానికే పట్టం కడతారని చెప్పారు. ఆత్మగౌరవానికి తమిళ ప్రజల మద్దతు చెబుతారని ఆకాంక్షించారు. సీఎం ఎం.కె.స్టాలిన్ నాయకత్వంలోని ప్రభుత్వం భారీ మెజారిటీతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. తమ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికలవేళ ఇచ్చిన హామీలేకా□□ ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నదని తెలిపారు. అనుమానం ఉంటే ఎవరైనా వచ్చి పరిశీలించవచ్చని అన్నారు. రైతు భరోసా కింద రూ. 2 లక్షల వరకు రుణ మాఫీ చేసినటు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం అందిస్తున్నట్లు వివరించారు.

**తమిళనాడు అంటే ఒక సిద్ధాంతం**

తమిళనాడు రాజకీయాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తాయని కొనియాడారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు.. అదొక గొప్ప సిద్ధాంతం అని చెప్పారు. పెరియార్, అన్నాదురై, కరుణానిధి వంటి మహనీయులు ఇక్కడ సామాజిక న్యాయానికి బలమైన పునాదులు వేశారన్నారు.



## సంపాదకీయం

# ఎండలు మండుతున్నాయి..

# బాధ్యత ఎక్కడ?

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అసమతుల్యత కారణంగా ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశమున్నట్లు వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించింది. అయినప్పటికీ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ హెచ్చరికలు మాటలకే పరిమితమవుతున్నాయి. పాలకుల్లో ముందుచూపు లోపం, సమగ్ర ప్రణాళికల కొరత వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ప్రకృతి వనరుల వినియోగంలో నియంత్రణ లేకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. నదుల్లో ఇసుక దోపిడీ, కొండల తవ్వకాలు, అడవుల నరికివేత.. ఇవి అన్నీ కలిపి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. చెట్ల కొరతతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీడ కూడా అరుదైపోయింది. ఉష్ణోగ్రతలు పెరగడం, భూగర్భ జలాల తగ్గుదల, గాలి కాలుష్యం పెరుగుదల.. అన్ని కలిపి ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయ రంగం ఈ ప్రతికూల పరిణామాలకు మొదటగా బలి అవుతోంది. వర్షాభావం, ఎరువుల కొరత, సాగునీటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశలతో పాటు ఆందోళనలను కూడా తెస్తోంది. విత్తనాలు, ఎరువులు, రుణాల వంటి ప్రాథమిక అవసరాలు సకాలంలో అందకపోవడం వల్ల రైతులు ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడి వ్యయం పెరగడం రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. కూలీల కొరత కూడా వ్యవసాయానికి పెద్ద సమస్యగా మారింది. జనాభా పెరుగుతున్నప్పటికీ వ్యవసాయ రంగంలో పనిచేయాలనే ఆసక్తి తగ్గుతోంది. యువత ఇతర రంగాలవైపు మళ్లిపోవడంతో చిన్న, మధ్య తరహా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాంత్రీకరణ పెరుగుతున్నప్పటికీ డీజిల్ ఖర్చులు, యంత్రాల నిర్వహణ వ్యయం రైతులపై అదనపు భారం మోపుతున్నాయి.

**ఇక అంతర్జాతీయ పరిస్థితులు కూడా రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, చమురు ధరల పెరుగుదల, ఎరువుల ముడిసరుకు కొరత వంటి అంశాలు దేశీయ వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రపంచ మార్కెట్‌లో మార్పులు దేశీయ వ్యవసాయాన్ని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికలను గంభీరంగా పరిగణించి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాల వారీగా పంటల ఎంపికపై రైతులకు స్పష్టమైన మార్గనిర్దేశనం ఇవ్వాలి. నీటి వినియోగంపై నియంత్రణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలి.**

అలాగే విత్తనాలు, ఎరువులు, రుణాలు సకాలంలో అందేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, పంట బీమా, మద్దతు ధరలు వంటి అంశాలను సమ–ర్థవంతంగా అమలు చేయాలి. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలి. తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీటి సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడం, లీకేజీలను తగ్గించడం, నీటి వృథాను నియంత్రించడం అత్యవసరం. ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచడం కూడా సమానంగా ముఖ్యమే.

**ప్రకృతి హెచ్చరికలు ప్రతి ఏడాది వస్తూనే ఉంటాయి. కానీ వాటిని గుణపాఠాలుగా తీసుకుని వ్యవస్థను సరిదిద్దడం పాలకుల బాధ్యత. ముందుచూపుతో వ్యవహరిస్తేనే రైతాంగాన్ని కాపాడగలం, భవిష్యత్తు సంక్షోభాలను తగ్గించగలం. లేకపోతే ప్రతి ఏడాది ఇదే సమస్యల పునరావృతం కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల సహకారం, ప్రభుత్వ సంకల్పం కలిసివస్తేనే ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.**



# త్రిస్సూర్‌లో బాణసంచా పేలుడు



## ఐదుగురు మృతి

### 40 మందికి పైగా గాయాలు

- పూరం ఉత్సవాల వేళ పెను విషాదం..
- కిలోమీటర్ల మేర వినిపించిన పేలుడు శబ్దం
- ముండతికొట్టెలో అగ్నిప్రమాదం..
- శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులు

**కేరళ:** ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం ఉత్సవాల కోసం బాణసంచా సిద్ధం చేస్తున్న సమయంలో ఊహించని ప్రమాదం జరిగి ఐదుగురు కార్మికులు మరణించారు. ముండతికొట్టెలోని తిరువంబడి డివిజన్‌కు చెందిన బాణసంచా ముడిసరుకు నిల్వ కేంద్రం (ఫ్యాక్టరీ)లో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో మరో 40 మందికి పైగా కార్మికులు గాయపడగా, వారిలో ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు తీవ్రతకు కిలోమీటర్ల దూరం వరకు శబ్దాలు వినిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వచ్చే శుక్రవారం జరగనున్న తిరువంబడి సెక్షన్ నమూనా ప్రదర్శన కోసం ఈ యూనిట్‌లో పెద్ద ఎత్తున బాణసంచాను తయారు చేస్తున్నారు. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో సుమారు 40 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం సరఫరా చేసిన భోజన ప్యాకెట్ల ఆధారంగా అక్కడ ఎంతమంది ఉన్నారనేది స్థానికులు అంచనా వేస్తున్నారు. ఈ పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, లోపల మరికొంత మంది చిక్కుకునే అవకాశం ఉందని నగర పోలీస్ కమిషనర్ నకుల్ రాజేంద్ర దేశ్‌ముఖ్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, పేలుళ్లు ఎడతెరిపి లేకుండా కొనసాగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. పైగా అగ్నిమాపక వాహనాలు లోపలికి వెళ్లేందుకు రహదారులు ఇరుకుగా ఉండటంతో, సమీపంలోని గోడలను పగలగొట్టి లోపలికి ప్రవేశించాల్సి వచ్చింది. మంటలు అదుపులోకి వచ్చాక గాయపడిన వారిని వెంటనే త్రిస్సూర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రి మరియు జనరల్ ఆసుపత్రులకు తరలించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులను ఆదేశించారు. ఘటనా స్థలంలో సహాయం అందించేందుకు 108 అంబులెన్స్‌లను భారీగా మోహరించారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి సమీపంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.







# ఇరాన్‌తో చర్చలకు సిద్ధం



- 'శాంతి' దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు!
- అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అధినేత..
- బెదిరింపులకు లొంగం: ఇరాన్

**ఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు శాంతి చర్చల ప్రతిపాదన చేశారు. ఇరాన్ నాయకత్వం సంప్రదింపులకు ముందుకు వస్తే, తాను నేరుగా చర్చల్లో పాల్గొనేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "వారు కలవాలనుకుంటే మా దగ్గర సమర్థులైన ప్రతినిధులు ఉన్నారు. ఒకవేళ నన్నే కలవాలనుకున్నా నేను సిద్ధమే. శాంతి చర్చల గురించి మాట్లాడటానికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయి" అని ప్రకటించారు. ఈ చర్చలు ప్రత్యక్షంగా సాధ్యం కాకపోతే వర్చువల్ విధానంలోనైనా జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య రెండో దఫా శాంతి చర్చలకు పాకిస్థాన్ వేదిక కానుందనే వార్తలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించబడే అవకాశం ఉందని అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రయాస్ కూడా అభిప్రాయపడ్డారు. అయితే, ఈ చర్చలపై ఇరాన్ నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఒకవైపు శాంతి దిశగా అడుగులు పడుతున్నాయన్న ఆశాభావం కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

### బెదిరింపులకు లొంగం: ఇరాన్

ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ అత్యంత ఘాటుగా స్పందించారు. అమెరికా తమపై నిరంతరం బెదిరింపులకు పాల్పడుతోందని, అటువంటి వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ముఖ్యంగా ఇరాన్ నౌకల రవాణాపై ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగ్బంధనం ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన మండిపడ్డారు. అమెరికా వైఖరిలో మార్పు రానంత వరకు చర్చలకు తావులేదని ఇరాన్ స్పష్టం చేయడంతో, ఈ ప్రతిపాదన ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది వేచి చూడాలి.

# ఉగ్రవాది అని అనలేదు..

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా!
- మోదీపై వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే వివరణ



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం ముదురుతున్న వేళ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదాన్ని రాజేశాయి. చెన్నైలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అన్నాడీఎంకే–బీజేపీ పొత్తును విమర్శిస్తూ ప్రధాని మోదీపై ఆయన చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరాయంటూ బీజేపీ మండిపడుతోంది. మోదీకి, బీజేపీకి సమానత్వంపై ఏమాత్రం విశ్వాసం లేదని, అటువంటి వారితో అన్నాడీఎంకే ఎలా చేతులు కలిపిందని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా పరిగణించింది. ఈ అవమానకర వ్యాఖ్యలకు గానూ ఖర్గేతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే స్పందిస్తూ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "నేను ప్రధాని మోదీని ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజలను, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే నా ఉద్దేశం" అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలను తప్పుగా చిత్రీకరించవద్దని కోరారు. తమిళనాడులో డీఎంకే–కాంగ్రెస్ కూటమిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఖర్గే తన పర్యటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ వైఖరి వల్ల దేశంలోని ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని ఆయన ఆరోపించారు. అయితే, ఖర్గే వివరణను బీజేపీ తిరస్కరిస్తోంది. ప్రధానిని కించపరచడం కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని, ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి దిగజారుడు విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేతలు ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఈ 'మాటల యుద్ధం' ఓటర్లపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# బీహార్ ఎంపీ 'పడకగది' వ్యాఖ్యల దుమారం

- రాజకీయాల్లో మహిళలపై జుగుప్సాకర విమర్శలు
- బెడ్‌రూమ్ నుంచే మహిళల రాజకీయ ప్రస్థానమంటూ వ్యాఖ్య..
- భగ్గుమన్న మహిళా లోకం.. రంగంలోకి బిహార్ మహిళా కమిషన్..
- ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని బీజేపీ డిమాండ్



**పాట్నా:** దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై సానుకూల చర్చ జరుగుతున్న తరుణంలో, బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలను కించపరిచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 90 శాతం మంది మహిళల రాజకీయ జీవితం నాయకుల 'పడకగది' (బెడ్‌రూమ్) నుంచే ప్రారంభమవుతుందంటూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఓ సందర్భంలో మాట్లాడిన పప్పూ యాదవ్.. రాజకీయ నాయకులందరూ మహిళలపై కన్నేసి వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి భారత్ వరకు ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉందని, నిత్యం ఎవరో ఒక నాయకుడి వికృత చేష్టలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు బయటపడుతూనే ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో ఒక బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉండి మహిళల క్యారెక్టర్‌ను కించపరిచేలా మాట్లాడటంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### మహిళా కమిషన్ నోటీసులు

పప్పూ యాదవ్ వ్యాఖ్యలను బిహార్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు బీజేపీ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. మహిళల పట్ల ఇంతటి హీనమైన ఆలోచనలు ఉన్న వ్యక్తిని పార్లమెంట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది.

### సోషల్ మీడియాలో వైరల్:

2024 లోక్‌సభ ఎన్నికల్లో పూర్ణియా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పప్పూ యాదవ్ వ్యాఖ్యల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. పార్టీలకు అతీతంగా మహిళా నేతలు ఆయన వైఖరిని ఎండగడుతున్నారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని కోరుకుంటున్న తరుణంలో, ఇలాంటి వ్యాఖ్యలు మహిళా లోకాన్ని మానసిక క్షోభకు గురిచేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు





- **సాంప్రదాయ పంటలు తగ్గించి కూరగాయల వైపు దృష్టి సారించాలి**
- **కూరగాయల పంటలకు సబ్సిడీలు అందిస్తున్న ప్రభుత్వం**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్22(సిరి న్యూస్)**

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని, రైతులు సాంప్ర దాయ పంటల నుండి లాభసాటి కూరగాయల సాగు వైపు మళ్లడం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.సాంప్రదాయ పంటలు తగ్గించి కూరగాయల వైపు దృష్టి సారించాలని కోరారు.కూరగాయల పంట లకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుం దన్నారు మంగళవారం టేక్మాల్ మండలం చంద్రు తండాలో కలెక్టర్ పర్య టించారు . 256 మంది రైతులు పండి స్తున్న లాభసాటి కూరగాయల సాగును పరిశీలించి. రైతులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కష్టాన్ని నమ్ముకుని పనిచే స్తారని రైతే దేశానికి వెన్నుముక అనే నినాదానికి నిదర్శనంగా చంద్రు తండా నిలుస్తుంది అన్నారు సేంద్రీయ వ్యవసా యం వైపు మొగ్గు చూపుతూ లాభసాటి కూరగాయల పెంపకంతో కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందడం హర్షించదగ్గ విషయంగా పేర్కొన్నారు. టమాటా, కాకర, చిక్కుడు, సొరకాయ సేంద్రీయ ఎరువులతో పెంచడంతోపాటు, తోటలు కూడా ఎంతో ఆరోగ్యవంతంగా పెరగడం నాణ్యత గల కూరగాయలు రైతులే స్వయంగా మార్కెట్కు తీసుకుని వెళ్లి వ్యాపారం నిర్వహించుకుని లాభాలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో స్ప్రింక్లర్స్ అందించడం జరి గిందని అదేవిధంగా వ్యవసాయ అధికా రులు రైతులకు కూరగా యల సాగుకు సంబంధించిన మెలకువలు అందించడం ద్వారా ఆర్థిక చేయూత కలుగు తుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడిం చారు.వ్యవసాయ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా అడుగులు వేస్తూ, సంప్ర దాయ మూస పద్ధతులకు స్వస్తి పలుకుతున్న రైతులు ఇప్పుడు లాభాల బాట పడుతున్నారని,ఎంతోమంది రైతులు సాగును లాభసాటి వ్యాపారంగా మలుచు కుంటున్నారని తెలిపారు.ప్రజల అవస రాలను దృష్టిలో పెట్టుకొని పంటలను పండించే విధంగా అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి రైతులకు అవగా హన కల్పించాలన్నారు.ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సర్పంచి స్రవంతి సర్దార్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈఓ వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టివిజెఏ పనితీరు అభినందనీయం

- **మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

**రామాయంపేట, ఏప్రిల్ 21(సిరి న్యూస్)**



వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసి యేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రెండు రోజుల క్రితం జరిగిన టివిజెఏ కార్యవర్గ ఎన్నికల్లో గెలుపొందిన ఆఫీస్ బేరర్లకు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా గెలుపు పత్రాలను మంగళవారం నాడు బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆయా న్యూస్ ఛానెల్స్ లో పనిచేస్తున్న వందలాది వీడియో జర్నలి స్టులను ఏకం చేసి, అసోసియేషన్ కార్యక లాపాలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మీడియా రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగునంగా, వీడియో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వృత్తి గౌరవాన్ని పెంపొందించడానికి మీడియా అకాడమీ చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ, 740మంది సభ్యులతో కొనసాగుతున్న వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ తమ సంఘానికి అనుబంధంగా పనిచేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఇంతమంది వీడియో జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ అసోసియేషన్, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆయా కమిటీల్లో వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కు ప్రాతినిధ్యం దక్కేలా తాము కృషి చేస్తున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. అలాగే ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల మంజూరీ కోసం టీయుడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్న్ అధికారి మోహన్ రాజ్ పిల్లయ్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, టివిజెఏ తాజా మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వనం నాగరాజు, అసోసి యేషన్ నూతన అధ్యక్షుడు హరీష్ నందూరి, ఉపాధ్యక్షుడు పి. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.సన్నీ, సహాయ కార్యదర్శి వి.జనార్ధన్ రెడ్డి, కోశాధికారి ఆర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, టీయుడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీలు సత్కరించారు.

# దొంగతనాల నివారణకు.. అప్రమత్తమైన భద్రత ఉండాలి

- **ఎస్ ఐ సోమేశ్వరి**

**( సిరి న్యూస్) కొండాపూర్:**




వేసవి కాలంలో పాఠశాలల సెలవులు, పెళ్లిలా పర్యటనలు, కుటుంబ సభ్యులతో ప్రయాణాలు జరుగు తాయని, ఈ పరిస్థితిని ఆసరాగా దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందని, అప్రమత్తమైన భద్రత ఉండాలని ఎస్ ఐ సోమేశ్వరి జాగ్రత్తలపై సూచించారు. మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలు, పోలీసులు అనుసంధానంతో , దొంగతనాలను నియంత్రించడానికి వీలు ఉంటుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతో పోలీసులకు సహకరించి సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇంటి బయట,డాబాలపై నిద్రించేవారు మెడలోని బంగారు ఆభర ణాలపై జాగ్రత్తగా ,అధిక మొత్తంలో బంగారం, నగదు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం మంచిదన్నారు. బస్సుల్లో, ప్రయాణంలో మీ వస్తువులు పట్టుకుని,అపరిచితులిచ్చే ఆహారా,పానీయాలు స్వీకరించ వద్దన్నారు. బయటకు వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా భద్రంగా దాచుకోవాలన్నారు బీరువాలకు,ఇంటి తలుపులకు నాణ్యమైన తాళాలు ఉప యోగించాలన్నారు. ఇంటి ముందు చెప్పులు, లైట్లు వేసి ఉంచడంతో ఇంట్లో ఎవరైనా ఉన్నట్టు భావన కలుగుతుం దన్నారు. పేపర్, పాలు వేసే వారికి ముందస్తుగా తెలిపి,వి శ్వసనీయమైన వాచ్‌మెన్‌లను మాత్రమే నియమించుకోవా లన్నారు. ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీసులకు, నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలనీ,ఇంటి పరిస్థితి గురించి పొరుగువారిని సంప్రదించాలన్నారు. బయటకు వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో ఎట్టి పరిస్థితుల్లో పెట్టవద్దని, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో భద్రతను పెంచుకోవచ్చు అన్నారు. సీసీ కెమెరా డీవీఆర్ లను రహస్య ప్రదేశాల్లో ఉంచి, మొబైల్ యాప్ ద్వారా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. బయట, ప్రయాణంలో, ముగ్గులు వేస్తున్నప్పుడు మెడలోని ఆభర ణాలను జాగ్రత్తగా కవర్ చేసుకోవాలన్నారు. ఎవరైనా అను మానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్కు కాల్ చేసి పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే దొంగత నాలను అరికట్టడం సాధ్యమవుతుందని ఎస్ ఐ సోమేశ్వరి పేర్కొన్నారు.

# విద్యతోపాటు సామాజిక అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్21(సిరి న్యూస్)**



విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు టేక్మాల్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో ఎంపీడీవో ఎంఈఓ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మక తలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య మరియు ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య మరియు పర్యావరణం – ఆంగ్లంలో మరియు తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి మరియు సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణ పై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియా యాయుద్దీన్, పంచాయితీ సెక్రెటరీ రాకేష్ , తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా చేస్తే కూల్చివేతే తహసిల్దార్ హెచ్చరింపు

**అమీన్ పూర్ ఏప్రిల్ 21 సిరి న్యూస్**



అమీన్ పూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 993 లో అక్రమంగా వెలిసిన ఇల్లీగల్ నిర్మాణాలను తాసిల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సంగీత రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్మాణాలను మంగళవారం నేలమట్టం చేయడం జరిగింది.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమణదారులు దౌర్జన్యంగా ప్రభుత్వ భూమిలోకి చొరబడి ప్రహరి గోడలు షెడ్లు తాత్కాలిక నిర్మాణాలను చేపట్టడం చట్ట విరుద్ధమని ఆయన హెచ్చరించారు. ఇకపై ప్రభుత్వ భూములపై నిరంతరం నిఘా ఉంచుతామని కబ్జాలకు పాల్పడి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

# భక్తి భావం వెల్లి విరిసింది ఆలయానికి లక్ష సహాయం

## సేవ పంతంలో ఆదర్శ్ రెడ్డి

## భక్తిశ్రద్ధలతో ఆలయ అభివృద్ధికి చేయుత

**జిన్నారం ఏప్రిల్ 21 సిరి న్యూస్**



జిన్నారం మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణం కొరకు లక్ష రూపాయల విరాళం అందించిన, బిఆర్ఎస్ పార్టీ పటాన్ చేరు ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . . మున్సిప ల్ కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ పనులు త్వరితగతిన పూర్తయి, భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కలగాలని కోరుకుం టున్నాను, అని అన్నారు.భక్తి మరియు సేవా, రాజకీయాలతో సంబంధం లేకుండా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఆలయ కమిటీ కృతజ్ఞతలు.. ఆలయ నిర్మాణానికి పెద్ద మనసుతో స్పందించి ఆర్థిక సాయం అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు కలిసి ఆదర్శ్ రెడ్డి ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, తోట నర్సింగ్ రావు, లింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ చట్టంపై అవగాహన సదస్సు



**హత్నూర, ఏప్రిల్ 21,(సిరి న్యూస్)**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య మంగళవారం హత్నూర గ్రామ పంచాయతీ కార్యాలయం నందు న్యాయ అవగహనపై సదస్సు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు. ముఖ్యంగా బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి అని అన్నారు. పాక్సో యాక్ట్ ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు విధించబడుతున్నాయని వివరించారు. డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ ద్వారా కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్లైన్ మోసాలు వంటి సమస్యల నుండి మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదే అని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు, అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని తేలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు, న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం సంగారెడ్డిని సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య , పంచాయతీ కార్యదర్శి మజర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రపురం, ఏప్రిల్ 21, (సిరి న్యూస్):**

రామచంద్రపురం డివిజన్‌లో బీహెచ్ఈఎల్ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తే ప్రజా ఉద్యమం తప్పదని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీహెచ్ఈఎల్ యాజమాన్యాన్ని కోరారు.మంగళవారం బీహెచ్ఈఎల్ ఈడి శ్రీనివాస్, ఏజీఎం సురన్ ప్రసాద్ లతో సమావేశమైన ఆయన, ఈఎస్ఐ సమీపంలోని బీరప్ప గుడిని పునర్నిర్మించాలని, రాయసముద్రం చెరువు సుందరీకరణకు అడ్డంకులు తొలగించాలని కోరారు.అలాగే క్రిస్టియన్ స్మశానవాటికను స్థానికులకు అందుబాటులో ఉంచాలని, హిందూ స్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుష్ప నగేష్, అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్ చెరు అభివృద్ధిపై మంత్రి దామోదర్ తో కాట శ్రీనివాస్ గౌడ్ భేటీ

- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ



**రామచంద్రపురం, ఏప్రిల్ 21, (సిరి న్యూస్):**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర ప్రజా సమస్యలపై ఇరువురి మధ్య విస్తృతంగా చర్చ జరిగింది.వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, పటాన్‌చెరు అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జనగణన ప్రక్రియకు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ ప్రతినిధి,ఏప్రిల్21(సిరి న్యూస్)**

జనగణన ప్రక్రియకు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల పాత్ర కీలకమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.టేక్మల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సెన్సెస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు.ఫీల్డ్ సిబ్బందికి జనగణన ప్రక్రియ, నియమాలు, బాధ్యతలపై అవగాహన కల్పించడం, డేటా సేకరణను సక్రమంగా నిర్వహించడం దీని లక్ష్యం. గా పేర్కొన్నారు జన గణనలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల పాత్ర కీలకమని, 34 పాయింట్లను జాగ్రత్తగా అధ్యయనం చేయాలని -కలెక్టర్ సూచించారు. సందేహాలుంటే అడగాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో పారదర్శక జనగణనే లక్ష్యంగా పటిష్ట చర్యలు

### తెలంగాణలో జనాభా లెక్కల ప్రక్రియపై చురుకుగా పర్యవేక్షణ

### రాష్ట్ర సెన్సస్ (జనగణన) డైరెక్టర్ భారతి హోళికేరి

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్21(సిరి న్యూస్)**



తెలంగాణలో పారదర్శక జనన గణనే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సెన్సస్ (జనగణన) డైరెక్టర్ భారతి హోళికేరి అన్నారు.చేగుంట మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఎన్యుమరేటర్లకు ,సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన మొదటి విడత మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసామన్నారు. ఎన్యుమరేటర్లు ,సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి 33 రకాల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలని తెలిపారు. పకడ్బందీగా జన గణన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్ర రెడ్డి, స్థానిక తహసిల్దార్, అధికారులు పాల్గొన్నారు.

# రెండు చేతులతో ప్రాణం పోద్దాం

- సిపిఆర్ నేర్చుకుని ఆదర్శంగా నిలవండి

**జిన్నారం ఏప్రిల్ 21 సిరి న్యూస్**



బొల్లారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మంగళవారం సిపిఆర్ ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు, డాక్టర్ మహేష్, ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి ప్రాణ రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు.గుండె ఆగిన పరిస్థితుల్లో తక్షణ స్పందన పై ప్రాక్టికల్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు.సి పి ఆర్ విధానాలను ప్రత్యక్షంగా చూపించి వివరించిన వైద్య బృందం అని తెలిపారు.అత్యవసర సమయంలో మొదటి సహాయం అందించే నైపుణ్యాల అభివృద్ధిని ప్రదర్శించారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో పోలీసుల పాత్రను మరింత బలోపేతం చేయడం జరిగిందని అన్నారు. సేవ దృక్పథం బాధ్యత భావం పెంపు లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించమని తెలిపారు. భయం వీడాలి చాలామంది అవగాహన లేక సహాయం చేయడానికి భయపడుతుంటారు. శిక్షణ తీసుకోవడం వల్ల ఆ భయం పోయి ఆత్మవిశ్వాసంతో ప్రాణాన్ని కాపాడవచ్చు అని తెలిపారు. సిపిఆర్ చేయడం ద్వారా శరీరంలోని ముఖ్య అవయవాలకు ముఖ్యంగా మెదడుకు నిరంతర రక్తప్రసరణ అందేలా చూడవచ్చు దీనివల్ల బ్రెయిన్డెడ్ అయ్యే ప్రమాదం తప్పుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రవీందర్ రెడ్డి, పోలీస్ డిపార్ట్మెంట్, వైద్య బృందం పాల్గొన్నారు.

# తాత్కాలిక మరమ్మతులు కాదు, శాశ్వత రోడ్డు కావాలి

- ఆర్ఆర్-7 సమస్యలపై అధికారులకు స్థానికుల వినతి

**రామచంద్రపురం, ఏప్రిల్ 21, (సిరి న్యూస్):**





వర్షాకాలం వస్తోందంటే చాలు ఆర్ఆర్7 రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు వణికిపోతున్నారు. గతేడాది గుంతలమయమైన రోడ్డు వల్ల జరిగిన ప్రమాదాలు, ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుగానే స్థానికులు అప్రమత్తమయ్యారు.గత సెప్టెంబర్‌లో సొసైటీ ప్రతినిధులు తెల్లాపూర్ అధికారులను కలిసి సమస్య తీవ్రతను వివరించడంతో, అత్యవసర డిజాస్టర్ రికవరీ నిధులతో గుంతలను పూడ్చారు. అయితే అది తాత్కాలిక ఉపశమనమే అని, అసలు సమస్యకు పరిష్కారం కాదని వారు స్పష్టం చేస్తున్నారు."ప్రతి వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్యాచ్ వర్క్‌లతో ఇక లాభం లేదు. పెండింగ్‌లో ఉన్న లేయర్ వర్క్ పూర్తి చేసి ఆర్ఆర్7కు శాశ్వత పరిష్కారం చూపాలి" అని అధికారులకు తాజాగా విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా, తెల్లాపూర్ వనం చెరువు, మేళ్లచెరువు నుంచి వచ్చే వరద నీటికి సరైన కల్వర్టు లేకపోవడంతో నీళ్లన్నీ నేరుగా రోడ్డుపైనే పారుతున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో రోడ్డు త్వరగా దెబ్బతింటోందని, ఉన్న కల్వర్టును పెద్దదిగా నిర్మించి నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చూడాలని అధికారులకు మనవి చేశారు.ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని, వర్షాలు మొదలయ్యేలోపు పనులు ప్రారంభించకపోతే గతేడాది పరిస్థితే పునరావృతమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నుంచి స్పందన కోసం వేచి చూస్తున్నామని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లేపల్లి బుచ్చిరెడ్డి, గోరుగంటి శ్రీధర్, రవి కోరుకొండ, నల్లపురెడ్డి గణేష్, వైయస్ కార్తీక్, శరత్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కానుకుంట జెడ్పీ హైస్కూల్‌కు అడ్వాంటా సంస్థ సహకారం

- రూ.25 లక్షలతో తరగతి గదుల ప్రారంభం,
- విద్యార్థులకు సేవా కార్యక్రమాలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 21 (సిరి న్యూస్ )**



గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా అడ్వాంట ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ విశేష సేవలను అందించింది. సంస్థ ఆధ్వర్యంలో రూ.25 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన రెండు ఆధునిక తరగతి గదులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ మాట్లాడుతూ అడ్వాంట సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతించారు. ఈ సేవలను స్ఫూర్తిగా తీసుకొని పాఠశాలను ఆదర్శవంతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. సంస్థ ప్రతినిధులు నగేష్, మధుసూదన్ రెడ్డి, చైతన్య కుమార్, రేనిత మాట్లాడుతూ తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని గుర్తుచేసుకున్నారు. పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు సేవ చేయడం తమకు అపారమైన ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటా రెడ్డి, ఉప సర్పంచ్ పాషా, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ పూజ, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, పెంచలయ్య, రమేష్, శివకుమార్, సుజాత, సువర్చల, అప్పిరెడ్డి, ఈశ్వర్, రాజేశ్వరి, చిత్ర ప్రియ, రజనీకుమారి, విజేత కుమారి, భబిత, రత్న, సాయి లీల, అడ్వాంట సంస్థ ఉద్యోగులు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ సామగ్రి, ఎగ్జామ్ ప్యాడ్‌లతో కూడిన కిట్లను అందజేశారు.

# బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి





- తెలంగాణ రాష్ట్ర జన గణన డైరెక్టర్ భారతి హోలీకెరీ

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్21(సిరి న్యూస్)**

జనగణన – 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జనగణ డైరెక్టర్ భారతి హోలీకెరీ అన్నారు.మంగళవారం మెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జనగణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు.ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రతిమా సింగ్ , మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల(సిరి న్యూస్)** : ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డిలతో కలిసి అర్జీదారుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజలు తెలియజేస్తే అధికారుల సమన్వయంతో వాటిని త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా 75లక్షల మంది రైతులకు రూ.6వేల కోట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని, రైతు సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయాలు కల్పించి వివిధ వ్యాపార రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తోందని తెలిపారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో రూ.25కోట్లు మంజూరై పనులు కొనసాగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైల్వే శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం కల్పించాలి

**ఎంపీడీఓ శ్రీనివాస్**



**తాండూర్(సిరి న్యూస్):** పని ప్రదేశాల్లో ఉపాధిహామీ కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ నీళ్లు తాగుతూ, ఎండ ఎక్కువగా అనిపిస్తే కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సర్పంచ్, సెక్రటరీలతో గ్రామ అభివృద్ధిపై చర్చించారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సర్పంచ్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సరైన భోజనం అందించాలని చెప్పారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. వారికి సమయానికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ్, వార్డు సభ్యులు ఉన్నారు.

# పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల(సిరి న్యూస్)** : బాలసదనం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1కోటి 34లక్షల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి ఆర్డీఓ శ్రీనివాస్ రావుతో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63,163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**మంచిర్యాల(సిరి న్యూస్):** రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నమ్నూర్ డివిజన్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలక్ట్రానిక్ కాంటాలు, తేమ కొలిచే యంత్రాలు, గోనె సంచులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో దళారుల కారణంగా రైతులు పంట కొనుగోలులో నష్టపోయారని, ప్రస్తుతం ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ధాన్యం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక రైతులు మరొక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, సంబంధిత మార్కెటింగ్ అధికారులతో చర్చించి త్వరలోనే అదనపు కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పథక సంచాలకులు డి.సుభాష్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముని, డివిజన్ కార్పొరేటర్లు లగిశెట్టి రాజయ్య, రాచమల్ల కమల, టీఎంసీ చంద్రయ్య, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, ఏరియా లెవెల్ ఫెడరేషన్ ప్రతినిధి సామల మల్లీశ్వరి, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

**హత్నూర(సిరి న్యూస్)** : గ్రామాలను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హత్నూర గ్రామపంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు కృషి చేయాలని సూచించారు. పాక్సో చట్టం ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయని వివరించారు. డొమెస్టిక్ వైలెన్స్ చట్టం ద్వారా కుటుంబాల్లో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఏలాంటి అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, నాయకులు చెక్క రవీందర్ గౌడ్, పండుగ రవికుమార్, నల్లోల్ల పెంటయ్య, వార్డు సభ్యుడు నాగేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఘనంగా గృహప్రవేశ మహోత్సవం

**బోథ్(సిరి న్యూస్):** మండలంలోని సాయినగర్ గ్రామంలో ఆత్రం ముకుంద్ రావ్ నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఆదివాసీ ముద్దుబిడ్డ కుంరం సత్యవతి కోటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముకుంద్ రావ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆత్మీయత, అనురాగాల మధ్య ఇలాంటి శుభకార్యాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, బోథ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆత్రం గంగారాం, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటాం



**బోథ్(సిరి న్యూస్):** కష్ట కాలంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బోథ్నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జాదవ్ సుభాష్ ఇటీవల మృతి చెందగా మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని కలిసి సుభాష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, తక్షణ సాయంగా తనవంతుగా రూ.5వేల నగదును అందజేశారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, బొందిడి సర్పంచ్ రాథోడ్ సునీత మధుకర్, మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్, నాయకులు బొజ్జ సాయన్న, జాదవ్ ఉమేష్, అచ్యుతానంద రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, మౌలానా, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

## సప్తాహకు రావాలని డీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం



**జైనథ్(సిరి న్యూస్):** మండలంలోని కరంజి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న బాజీరావు బాబా సప్తాహ కార్యక్రమానికి హాజరుకావాలని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ను నాయకులు ఆహ్వానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు ఎల్టీ జగదీష్ రెడ్డి, బిక్కి గంగన్న కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. వారి వెంట బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, డీసీసీ జనరల్ సెక్రటరీ మల్యాల కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు తొడసం దౌలత్ రావు, బండారి సతీష్ తదితరులు ఉన్నారు

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



**సత్తుపల్లి(సిరి న్యూస్)** : విధుల్లో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి (డీడబ్ల్యుఓ) విజేత అన్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం సెక్టార్ లో గల అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడి కోడిగుడ్డు పెడుతున్నారా.. ఆటలు ఆడిస్తున్నారా అని అడగగా, పెడుతున్నారని చిన్నారులు సమాధానం ఇచ్చారు. కేంద్రాల్లో ఉన్న చిన్నారుల బరువును తూకం వేసి పరిశీలించారు. లబ్ధిదారులను అందిస్తున్న పౌష్టికాహారం వివరాలపై ఆరా తీశారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సూపర్ వైజర్ లకు, సీడీపీఓలకు నెలవారి మాముళ్లు ఇస్తున్నారా అని ప్రశ్నించగా, లాంటిదేమి లేదని టీచర్స్, హెల్పర్స్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడైనా టీచర్స్, ఆయాలు విధుల్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రజా గొంతుక కు విజయం

## ఎస్టీపీ ప్లాంట్ తరలింపు నిర్ణయం పై హర్షం

## ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన కాలనీ ప్రజలు



**అమీన్ పూర్ ఏప్రిల్ 21 సిరి న్యూస్**

అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో ఎస్టీపీ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ప్రజల కోరిక మేరకు ప్రభుత్వానితో మాట్లాడి రద్దు చేస్తామని ప్రజల సమక్షంలో చెప్పడం జరిగింది.మంగళవారం పీపుల్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు అందరూ కలిసి ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నివాస ప్రాంతాల ప్రజల కోరిక మేరకు ఎస్టిపి ట్రీట్మెంట్ ప్లాంటును ప్రభుత్వానితో మాట్లాడి రద్దు చేయిస్తానని తెలిపారు. ప్రజల ఆరోగ్యం మరియు భవిష్యత్తులో వచ్చే దుర్వాసన, భూగర్భ జలాలు, కలుషితం కావడం మరియు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజల విజ్ఞప్తి మేరకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ అసోసియేషన్, మరియు కాలనీ సభ్యులు పాల్గొన్నారు

# జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం



**సత్తుపల్లి(సిరి న్యూస్):** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫకృద్దీన్ తనయుడు ఎండి శంశొద్దీన్ తన జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకున్నారు. సోమవారం గ్రామంలోని వృద్ధుల శరణాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శంశొద్దీన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాగా వృద్ధులు శంశొద్దీన్ ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇంటి పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

## రైతులకు కూరగాయల విత్తనాల మినీ కిట్ల పంపిణీ



**తాండూర్(సిరి న్యూస్):** ఇంటి పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఉద్యాన విస్తరణ అధికారిణి శ్వేత రాణి అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాసాడి తిరుపతి చేతుల మీదుగా రైతులకు ఐదు రకాల కూరగాయల విత్తనాల కిట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పంటల సాగును అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ మినీ కిట్లను ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రతి కిట్లో ఐదు రకాల నాణ్యమైన విత్తనాలు ఉన్నాయని తెలిపారు. కూరగాయల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతుల్లో పంటలు పండించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మర్లపాడులో ఆంధ్ర సీఎం జన్మదిన వేడుకలు

**సత్తుపల్లి(సిరి న్యూస్):** వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పరస్పరం తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయనకు దీర్ఘాయుశ్శు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి మురళిధర్ రెడ్డి, తోట పుల్లారావు, గ్రామ శాఖ నాయకుడు శివ నాగ సూరి, మందపాటి బాబు రెడ్డి, ఆంజనేయులు, కొణిజర్ల రాంబాబు, శ్రీను, కృష్ణ, సదాశివరావు, దారా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని ఎంపొందించడానికే గ్రాద్యుయేషన్ డే

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ అంగన్వాడీలు
- మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, ఏప్రిల్ 21 (సిరి న్యూస్ ):**




పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో గ్రాద్యుయేషన్ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని గుమ్మడిదల మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి అంగన్వాడి కేంద్రంలో గ్రాద్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ అంగన్వాడీలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చిన్నారులకు ప్రీ-స్కూల్ దశలోనే నాణ్యమైన విద్య అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో గ్రాద్యుయేషన్ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. అంగన్వాడీల ద్వారా చిన్నారుల బౌద్ధిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని పెంపొందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గిద్దె విజయలక్ష్మి, సురభి కుమార్ గౌడ్, శ్రీచూర్ణం చక్రపాణి, నాయకులు సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, చప్పటి మహేష్, రమేష్, అంగన్వాడి సూపర్వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు**

గ్రాద్యుయేషన్ డే సందర్భంగా చిన్నారి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. అంగన్వాడి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రత్యేక వేషధారణలో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పిల్లల ప్రతిభను అభినందించారు. కార్యక్రమం అంతా ఉత్సాహభరితంగా కొనసాగింది.

# హట్టహాసంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు





**సంగారెడ్డి, ఏప్రిల్ 21 (సిరి న్యూస్):**

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణాన్ని తలపించింది. పట్టణం అంతటా ఎమ్మెల్యే ఫ్లెక్సీలు, బ్యానర్లు అలంకరించగా, కార్యకర్తలు, అభిమానుల సందడి నెలకొంది. మండలాల వారీగా వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రేన్లతో గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిఆర్ఎస్ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణం 13వ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పార్కుల అద్దెలపై మున్సిపల్ అధికారుల కొరడా



సిరి ఎఫెక్ట్



- మల్కాజిగిరి మున్సిపాలిటీ కబ్జాలపై అరా

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 21:**

హైదరాబాద్ మహా నగరంలో పబ్లిక్ పార్కులను అద్దెలకిస్తున్న వైనాన్ని మంగళవారం సిరి దినపత్రికలో "ఇచట పార్కులు అద్దెకివ్వబడును" శీర్షికన వార్త ప్రచురితం అయ్యింది. జరుగుతున్న వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన సిరి కథనం పై మల్కాజిగిరి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని డివిజన్ లలో పలువురు అధికారులు విచారణ చేపట్టగా కొన్ని పార్కుల్లో అద్దెకు ఖాళీస్థలం ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై వెంటనే అధికారులు స్పందించి పలు ప్రాంతాల్లో వెలిసిన దుకాణాలను ఖాళీ చేయించారు. అట స్థలాలను కబ్జా చేస్తూ అసోసియేషన్లు చేస్తున్న ఆగడాలకు మున్సిపల్ అధికారులు అడ్డుకట్ట వేశారు. దింతో నిన్నటివరకు షాపింగ్స్ టెంట్లు కనపడ్డ చాల స్థలాలలో నేడు ఖాళీగా కనవుడుతున్నాయ్. కొన్ని చోట్ల అధికారులే తమ పర్యవేక్షణలో సదరు దుకాణాలను ఖాళీచేయించడం పట్ల మున్సిపల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను వెలుగులోకి తెచ్చిన సిరి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

# జొన్న రైతులను ఆదుకోవాలి

## మంత్రి జూపల్లికి పసుల చంటి విన్నపం

**ఆదిలాబాద్(సిరి న్యూస్):** జిల్లాలో తెల్ల జొన్నల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు దిగుబడులు కూడా అధికంగా రావడంతో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కోరారు. మంగళవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్లో కలిసి జిల్లాలోని జొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ ఈ ఏడాది జొన్న పంట అంచనాలకు మించి పండడంతో రైతులు మార్కెటింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ఎకరానికి కనీసం 20 క్వింటాళ్ల చొప్పున జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అలాగే రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే జిల్లా కలెక్టర్తో మాట్లాడి కొనుగోలు కేంద్రాల పెంపుపై తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎకరానికి 20 క్వింటాళ్ల కొనుగోలు అంశాన్ని రాష్ట్ర వ్యవసాయ, ఆర్థిక శాఖ మంత్రులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, గత ఏడాది కంటే అధికంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే జిల్లాలోని జొన్న రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందని పసుల చంటి ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.